క్లుప్తంగా

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



భవనం ప్రారంభిస్తున్న విఠల్‌రెడ్డి

కుంటాల: ఉన్నతంగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ము ధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఓలాలో శ్రీ వాసర సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో భవనం ప్రారంభించి శ్రీ సరస్వతిమాత విగ్రహం ఆవిష్కరించారు. ఎంపీటీసీ కట్ట రవి, మాజీ సర్పంచులు కనీస్ ఫాతిమా, ప్రవీణ్, ప్రిన్సిపాల్ గజానంద్, గంగన్న, గణేశ్, ప్రవీణ్‌కుమార్, హైమద్‌పాషా, సదాశివ్ పటేల్, శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్, కూస శంకర్, శరత్‌గౌడ్, వెంకటేశ్, రామానంద్ పాల్గొన్నారు.

14న పటేల్ యూత్ గర్జనసభ

నిర్మల్‌చైన్‌గేట్: కరీంనగర్‌లో ఈనెల 14న ఆదివారం జరిగే పటేల్‌యూత్ గర్జన సభను విజయవంతం చేయాలని మున్నూరుకాపు జర్నలిస్టుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుమ్ముల అశోక్ ఒక ప్రకటనలో కోరారు. సభలో పలు అంశాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. మున్నూరు కాపు కులస్తులకు పటేల్ పేరు గెజిట్ తీసుకొస్తామన్నారు. హైదరాబాద్‌లో చదువుతున్న వివిధ గ్రామాలకు చెందిన బాలబాలికలకు వేర్వేరుగా వసతిగృహం ఏర్పాటుకు తీర్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సభకు జిల్లాలోని మున్నూరుకాపు యువకులు తరలిరావాలని కోరారు.

కొనసాగుతున్న పూజలు



పూజలు చేస్తున్న జాన్సన్‌నాయక్

పెంబి: మండల కేంద్రంలోని శ్రీ హరహర దేవస్థానం 16వ వార్షికోత్సవంలో భాగంగా రెండోరోజైన శుక్రవారం బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్ నాయక్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు జాన్సన్‌నాయక్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పూర్ణచందర్‌గౌడ్, సుధాకర్ తదితరులున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన తోకల శ్రీనివాస్ గురువారం సాయంత్రం బైక్‌పై వెళ్తూ గ్రామంలోని పెట్రోల్‌బంక్ వద్ద ఫోన్ పోగొట్టుకున్నాడు. అదే దారిలో వస్తున్న హీరాలాల్ అనే యువకుడికి ఫోన్ దొరకగా పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. ఎస్సై చంద్రమోహన్.. శ్రీనివాస్‌ను పోలీస్‌స్టేషన్‌కు రప్పించి ఫోన్ అందించారు.

‘ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇవ్వాలి’

ముధోల్: నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలని ఆ సంఘం భైంసా డివిజన్ అధ్యక్షుడు మోహన్ అన్నారు. శుక్రవారం ముధోల్‌లో ఏర్పాటు చేసిన ఆర్‌ఎంపీల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల ఆరోగ్య రక్షణకై ఆర్‌ఎంపీలు, పీఎంపీలు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ప్రథమ చికిత్సలు కొనసాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముధోల్ ఆర్‌ఎంపీ అసోషియేషన్ అధ్యక్షుడు దుర్గప్రసాద్, ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఉన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగలో ఏర్పాటు చేసే అంబేద్కర్ విగ్రహావిష్కరణకు అంబేద్కర్ సంఘ నాయకులు, అభిమానులు తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేతుల మీదుగా విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో అంబేద్కర్ సంఘ భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ సునారికారి రాజేశ్, కోకన్వీనర్లు ఇందూర్ నేత, లింగన్న, బొడ్డు గంగన్న, జడ రాజేశ్వర్, రాజలింగం, వెంకన్న, చిన్నయ్య, గంగన్న, శంకర్, గంగాధర్, రాజేందర్ ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ రహదారిపై రోడ్డు భద్రత నిబంధనలపై శుక్రవారం ఆర్టీసీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఆర్టీసీ బస్సులో జీపీఎస్ సిస్టమ్ అమలులో ఉందని.. వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలని కోరారు. ఆర్టీసీ గమ్యం యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే ఏయే బస్సు ఏయే సమయంలో ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. సిబ్బంది ఎల్.నర్సయ్య, డి.గంగన్న తదితరులు ఉన్నారు.

గుట్టపైన.. గుహలోన..

- కొలువుదీరిన గుట్టవెంకన్న..
- సహజసిద్ధ చారిత్రక ఆలయం
- స్వామివారికి రాణిపద్మాదేవి పూజలు
- నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



స్వామివారి పురాతన విగ్రహం



గుట్టవెంకన్న స్వామి గుహ ఆలయం

నిర్మల్: కలియుగ దైవంగా పేరొందిన వేంకటేశ్వరుడికి కోటను తలపించే దేవరకోట దేవస్థానాన్ని నిమ్మల రాజులు నిర్మించారు. ఆ దివ్య మంగళ స్వరూపుడైన దేవదేవుడు 450 ఏళ్లుగా నిర్మల్ దేవరకోట శ్రీలక్ష్మీ వేంకటేశ్వ ర స్వామి దేవస్థానంలో కొలువై ఉన్నాడు. కానీ.. చాలా మంది నిర్మల్ వాసులకే తెలియని విషయమేమంటే.. తిరుమలలో ఎలాగైతే కొండపై స్వామివారు కొలువుదీరారో.. అలాగే నిర్మల్‌లోనూ దేవరకోటతోపాటు ఆలయానికి అభిముఖంగా కుర్రన్నపేట–ఎల్లపల్లి దారిలో గల గుట్టపై.. అది కూడా సహజసిద్ధమైన రాతిగుహలో.. మరో వెంకన్నస్వామి కొలువై ఉన్నాడు. వందల ఏళ్లుగా పూజలు అందుకుంటున్న ఆ స్వామివారు శనివారం నుంచి నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు సిద్ధమయ్యాడు.

రాణి పద్మాదేవి కోసం...

నిర్మల్ నుంచి కుర్రన్నపేట మీదుగా ఎల్లపెల్లి వైపు వెళ్లే దారిలో ఉన్న ‘వేంకటేశ్వరగఢ్(రాణిమహల్)’పై గుహలో దాదాపు 350ఏళ్లుగా గుట్ట వేంకటేశ్వరుడిగా, వెంకన్నగా పూజలందుకుంటున్నాడు. నిమ్మల(నిర్మల్) నిన్నమొన్నటిది కాదు.. వందల ఏళ్లక్రితమే నిర్మితమైంది. ఈ నేలపై తన వేటకుక్కలను కుందేళ్లు వెంటపడి తరిమిన మహాత్యాన్ని కళ్లారా చూసిన నిమ్మనాయుడు నిమ్మలకు పురుడు పోశాడు. ఆ తర్వాత ఆరుగురు పరిపాలనదక్షుల కాలంలో కోటలు, గఢ్‌లతో నిమ్మల బలమైన రాజ్యమైంది. ఈ రాజుల్లో శ్రీనివాసరావు ముఖ్యుడు. ఆయన ప్రస్తుతం నిర్మల్‌లో ఉన్న చాలా కోటలు, బురుజులతో పాటు ఆలయాలనూ నిర్మింపజేశాడు. ఈక్రమంలో తన పట్టపురాణి అయిన శ్రీమతి పద్మాదేవి కోసం నిర్మల్‌కు తూర్పున, బత్తీస్‌గఢ్‌కు ఉత్తరాన ప్రత్యేకంగా రెండతస్తుల అందమైన రాణిమహల్ నిర్మించాడు. పద్మాదేవి, శ్రీనివాసరావు దంపతులు వేంకటేశ్వరస్వామి భక్తులు. పద్మాదేవి కోరిక మేరకు రాణిమహల్ ఉన్న గుట్టపైనే ఉత్తరాన సహజసిద్ధంగా ఉన్న రాతిగుహలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కట్టించాడు.

ఇక్కడ విశేషాలెన్నో...

గుట్టపై కొలువుదీరిన వేంకటేశ్వరుడి గుహకు ఉత్తర ద్వారం ఉంది. ఇదికాక రాణి పద్మాదేవి వచ్చేందుకు తన మహల్‌లోని శయనమందిరం నుంచి గుహలోకి ప్రత్యేక సొరంగ మార్గం కూడా నిర్మించారు. రాణి పద్మాదేవి ఇక్కడ స్వామివారికి పూజలు చేసిన తర్వాత కార్తీకమాసంలో నిజామాబాద్ జిల్లా బాల్కొండ వెళ్లేవారు. ఇందుకోసం రాణిమహల్ నుంచి బాల్కొండ వరకూ సొరంగమార్గం ఏర్పాటు చేయడం విశేషం. బాల్కొండకోటలో ఉన్న కోనేరులో కార్తీక దీపోత్సవం జరిపి తిరిగి వచ్చేవారని నిమ్మల చరిత్ర చెబుతోంది. ఈ వేంకటేశ్వరుడు కొలువైన ఈగుట్టకు వేంకటేశ్వరగఢ్‌గా నామకరణం చేశారు. ఇక్కడి గుహలోని రాతిపైనే ఉత్తర ముఖుడైన వేంకటేశ్వరస్వామి వారి రూపాన్ని సుందరంగా చెక్కారు. ఈ గుహ ఆలయం ఎదురుగా భారీ బండరాయిపై ఆంజనేయ స్వామి విగ్రహం ఉంది.

ప్రతిష్ఠాపనోత్సవాలకు సిద్ధం...

వందల ఏళ్లుగా రాతిగుహలో పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామిపైనా శత్రుదాడులు జరిగాయి. చాలా సార్లు భక్తులు విగ్రహ పునఃప్రతిష్ఠాపన చేస్తూ.. ఆలయాన్ని నిలుపుతూ వచ్చారు. ఇదేక్రమంలో ఈనెల 13,14, 15తేదీల్లో కృష్ణశిలతో చేయించిన స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 15న ఉదయం 11:38గంటలకు స్వామివారి విగ్రహప్రతిష్ఠాపన ఓలా భగవాన్‌పంతులు, పెరుమాండ్ల అరుణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో కొనసాగనుంది. స్థానిక కుర్రన్నపేట కాలనీవాసులు, స్వామివారి అర్చకసేవలో కొనసాగుతున్న పెరుమాండ్ల వంశస్తుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగనున్నాయి.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

కుంటాల: ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని పెంచికల్‌పాడ్‌లో కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం సెక్రెటరీ సూర్య వంశీ సాయినాథ్, కార్యకర్తలు దిగంబర్, మణికంఠ, లోకేశ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: పార్లమెంట్ ఎన్నికల్లో నగేశ్‌ను ఎంపీగా గెలిపించాలని ఆ పార్టీ ముధోల్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఈనెల 14 నుంచి 16 వరకు సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో 13న పోలింగ్‌బూత్ కార్యకర్తల సమ్మేళనానికి కేంద్ర మంత్రి హాజరవుతారని.. తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయసాగర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి సాయినాథ్, నల్ల రమేశ్, పోలింగ్ బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న భోజన్న

కేంద్రప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి మళ్లీ బీజేపీ పార్టీకి ఓటేసి గెలిపించాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దడిగే భోజన్న అన్నారు. శుక్రవారం లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో కార్యకర్తలతో కలిసి ఇంటింటా బీజేపీ ప్రచారం నిర్వహించారు.

‘కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి’

కడెం: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ మైనార్టీ అబ్జర్వర్ షబ్బీర్‌పాషా పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరితరిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మైనార్టీ వర్గాన్ని చైతన్యపరిచి కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. అనంతరం అబ్జర్వర్‌గా నియమితులైన షబ్బీర్‌పాషను మైనార్టీ నాయకులు సన్మానించారు. మండలాధ్యక్షుడు మల్లేశ్, పట్టణాధ్యక్షుడు వాజిద్‌ఖాన్, బబ్లూ, వసిౌద్దీన్, ఆయాజ్, మక్బూల్, మీర్జాబేగ్, షరీపొద్దీన్, జావీద్, అత్తు, అఫ్రిది, సల్మాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షబ్బీర్‌పాషా

సాగునీటి విడుదలపై హర్షం

కడెం: సదర్మాట్ కాలువ నీటిని విడుదల చేయడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జుకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం ఉపాధి కూలీలతో ధర్నాలు చేయడం సిగ్గు చేటని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అనుచరులు నీటి విడుదలపై గొప్పలు చేప్పుకోవడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, బొడ్డు గంగన్న, నాయకులు రాజు, భూషణ్, శ్రీనివాస్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలో ఉన్న కొమ్ముతండా, తుమ్మగూడెం, ఇప్పమాడ గ్రామాల్లో శుక్రవారం బోర్‌వెల్‌లను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని నాయకులు ఎమ్మెల్యే బొజ్జు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ నిధులతో తాగునీటి ట్యాంకుల కోసం బోర్లను వేయించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాంచందర్, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, బలరాం నాయక్, శివ్‌లాల్, వసంత్, మల్లేష్, వినోద్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



భూమిపూజలో పాల్గొన్న నాయకులు

బాధిత కుటుంబాలకు పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్ గ్రామంలో ఇటీవల భోజన్న, లక్ష్మణ్ మరణించగా.. బాధిత కుటుంబాలను శుక్రవారం ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరామర్శించారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చి మృతికి కారణాలను తెలుసుకున్నారు. వారి వెంట రమేశ్, బద్దం గంగారెడ్డి, పృథ్వీ, లింగారెడ్డి ఉన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

తల్లిదండ్రులను గౌరవించుకోవాలి

భైంసాటౌన్: ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రకృతివనంలో తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తల్లిదండ్రులు, పెద్దలను, గురువులను దైవ సమానంగా పూజించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాల్వి రమేశ్, చిన్నారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘బాధ్యులపై చర్యలు తీసుకోవాలి’

తానూరు: మండలంలోని ఝరి(బి) గ్రామంలో అంబేద్కర్ (పంచరంగుల) జెండాను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘం నాయకులు శుక్రవారం ఎస్సై సందీప్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొందరు గొడవలు సృష్టించేందుకు ఏర్పాటు చేసిన పంచరంగి జెండాను కింద పడేసి అవమానించారన్నారు. సమాచారం అందుకున్న ముధోల్ సీఐ మల్లేశ్, ఎస్సై సందీప్, తహసీల్దార్ లింగంమూర్తి గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. బాధ్యులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

‘జయంతి నిర్వహణకు అనుమతివ్వాలి’

ఖానాపూర్: ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాల్లో అంబేద్కర్ జయంతి అధికారికంగా నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాసమల్ల అశోక్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్, అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు మేస సతీశ్ పాల్గొన్నారు.

‘అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని శిక్షించాలి’

నిర్మల్‌టౌన్: బీఆర్ అంబేద్కర్‌పై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని శిక్షించాలని అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్మల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫేస్‌బుక్‌లో ఆర్యపుత్ర పేరిట ఉన్న అకౌంట్ నుంచి అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. వెంటనే ఐడీని తొలగించి ఐడీ వినియోగిస్తున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాల్లో పంటలు పరిశీలన

పెంబి: అకాల వర్షాలు, ఈదురుగాలులతో జొన్న, నువ్వుల పంటల దిగుబడులు తగ్గే అవకాశం ఉందని.. రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈవో రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంకెన, రాయదారి, పోచంపల్లి గ్రామాల పరిధిలోని వివిధ పంటలను పరిశీలించారు. జొన్న పంటలో గింజ గట్టిపడే దశ నుంచి కంకి దశలో ఉందన్నారు. తెగుళ్ల వృద్ధి చెందే అవకాశం ఉందని.. లేత కంకులున్న రైతులు లీటర్ నీటికి 2గ్రాముల మాకోజెబ్ లేదా 1మిల్లీ లీటరు ప్రాపికోనజోలు మందు పిచికారీ చేయాలని సూచించారు. వారి వెంట పలువురు రైతులు ఉన్నారు.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పంట నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని 11కేవీ సాయిబాబా ఫీడర్, 11కేవీ సోఫీనగర్, 11కేవీ మారెమ్మ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వనాథ్‌పేట్, వైఎస్సార్ కాలనీ, వేద ఆగ్రో ప్రాంతాల్లో ఉదయం 7:30 నుంచి 11 గంటల వరకు, సోఫీనగర్, ఆదర్శనగర్, ఇందిరమ్మ కాలనీ, శాస్త్రీనగర్, శ్రీనగర్‌కాలనీ, శాంతినగర్, మంచిర్యాల చౌరస్తా, విద్యానగర్ ఏరియాలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని.. ప్రజలు సహకరించాలని కోరారు.

సారంగపూర్: మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని చించోలి(బి), ఆలూరు, వంజర్ సబ్‌స్టేషన్ పరిధిలోని తాండ్ర(జి) గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. స్వర్ణ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కడెం: సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో మండలవ్యాప్తంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ సుమన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

భైంసాటౌన్: పట్టణంలోని 133కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నిర్మల్‌రోడ్డు, రాహుల్‌నగర్, సంతోషిమాతనగర్, పిప్రి కాలనీ, పులేనగర్, వినాయక్‌నగర్, ఓవైసీనగర్, రాజీవ్‌నగర్, మోమినామ్ గల్లి, బస్టాండ్ ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఏఈ మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

లక్ష్మణచాంద: 11కేవీ తీగల కింద చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మండలంలోని చామన్‌పెల్లి, పార్‌పెల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. సాధారణ మరమ్మతుల్లో భాగంగా నర్సాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భైంసారూరల్: మండలంలోని దేగాం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ శ్రీనివాస్ తెలిపారు.

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

తానూరు: తానూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం సాయంత్రం 4 నుంచి ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీరాములవారి విగ్రహ ప్రతిష్ఠాపన



తాంశలో మంగళహారతులతో మహిళలు



ఖానాపూర్ : పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌రూరల్: మండలంలోని తాంశ గ్రామంలో నూతన ఆలయంలో శ్రీరాములవారి విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం ఘనంగా నిర్వహించా రు. మంగళహారతులతో మహిళలు, గ్రామస్తులు విగ్రహాలను శోభాయాత్రగా ఆలయానికి తీసుకొచ్చి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రతిష్ఠించారు. అనంతరం గణపతి హోమం చేశారు. భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం శ్రీలక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్లకిసేవలో భక్తులు..

ఖానాపూర్: శ్రీరామనవమి నేపథ్యంలో పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న హనుమాన్ ఆలయంలో చేపట్టిన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజైన శుక్రవారం ఐదోవార్డు పరిధిలోని ఇంద్రనగర్‌లో పల్లకిసేవ ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు కీర్తి రాఘవశర్మ ఆధ్వర్యంలో శోభాయాత్రలో భక్తులకు హారతి ఇచ్చి పూజలు చేశారు. గంగాధర్, అడ్డగట్ల రాజన్న, పాదం రాకేశ్, నరేందర్, రవి, వంశీ, చింటు తదితరులున్నారు.

నీళ్లందక ఎండుతున్న పైరు



లక్ష్మణచాంద: రోజురోజుకూ ఎండలు పెరుగుతుండటంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో సకాలంలో సాగునీరు అందక పొట్టకొచ్చిన పొలాలు ఎండుతున్నాయి. మండలంలోని బోరిగాం తండాకు చెందిన జాదవ్ భీమ్‌సింగ్ అనే రైతు అర ఎకరంలో వరి పంట సాగు చేశాడు. మొదట్లో బోరు నుంచి నీళ్లు బాగానే వచ్చాయి. కానీ గత 10 రోజులుగా భూగర్భజలాలు తగ్గడంతో బోరు నుంచి నీళ్లు రావడం లేదు. పంట పూర్తిగా ఎండిపోతుందని.. ఏం చేయాలో తెలియడం లేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని సుభాశ్‌నగర్‌కు చెందిన ఉప్పు నవీన్ గల్ఫ్ దేశం బెరాన్ వెళ్లి అక్కడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం బాధిత కుటుంబాన్ని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు పరామర్శించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి మృత్యువాత పడ్డ వారి మృతదేహాలను వెంటనే స్వదేశాలకు తెచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వారి వెంట లక్ష్మణ్, తదితరులున్నారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూలీలకు నీరు పంపిణీ

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో ఆర్‌పీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలకు తాగునీటి బాటిళ్లను ఆర్పీఎఫ్ ఫౌండేషన్ అధినేత రమ్య గ్రూప్ ప్రసాద్ యాదవ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌పీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, వైద్యంతోపాటు రైతులకు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.